క్లుప్తంగా

పారదర్శకంగా 'ఉపాధి'

ఐరాల: ఉపాధి పనులను పారదర్శకంగా చేయాలని ఏపీఓ సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రోజుకు రూ.257 వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలన్నారు. పనులు చేసే ప్రాంతంలో ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదర్శ రైతుకు నాగార్జున వర్సిటీ ఆహ్వానం


జగదీష్‌రెడ్డి

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు జగదీష్‌రెడ్డిని గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆహ్వానించింది. గురువారం ఆయనకు ఆహ్వాన లేఖ అందింది. ఈ నెల 23, 24న ప్లాంటియన్స్ ఇన్ ప్లాంట్ అండ్ మైక్రోబయల్ రీసెర్చ్–2023పై జాతీయ సదస్సు నాగార్జున వర్సిటీ నిర్వహిస్తోందని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఆ సదస్సులో తాను ప్రసంగించనున్నట్లు జగదీష్‌రెడ్డి తెలిపారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

ఐరాల: గ్రామాల్లో డ్వాక్రా సంఘాల బలోపేతానికి వెలుగు సిబ్బంది కృషి చేయాలని ఏపీఎం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో వీఓఏలతో ఆయన సమీక్షించారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీ నిధి, ఎస్సీ సబ్‌ప్లాన్ రుణాలు సకాలంలో చెల్లించేలా గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రేపు సుబ్రమణ్యస్వామి ఆలయంలో పాలాభిషేకం

చిత్తూరు రూరల్: తై మాసాన్ని పురస్కరించుకుని చిత్తూరు గిరింపేటలోని శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం కాళ భైరవ ట్రస్టు ఆధ్వర్యంలో పాలాభిషేకం, విశేష పూజార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటేశన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని, భక్తులు విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో పేకాట ఆడుతున్న 9మంది నిందితులను వన్ టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో వన్ టౌన్ పోలీసులు దాడులు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.39,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాబలం ఉంది

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

పూతలపట్టు: సిద్ధాంతాలను అనుసరించి కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ తెలిపారు. గురువారం పూతలపట్టులో ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉందని పేర్కొన్నారు. అనంతరం పూతలపట్టు ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం మారాక ఆసుపత్రుల రూపురేఖలు మారాయని కితాబిచ్చారు. సమావేశంలో ప్రభాకర్, బుల్లెట్ రవి, నాగరాజ, మునిరత్నం, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన

యాదమరి: మండలంలోని బుడితిరెడ్డి పల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం ప్రజలకు కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎవరికైనా స్పర్శ లేనిమచ్చలు కుష్ఠు నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని వైద్యసిబ్బంది కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తారని, క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు.

గజ వాహనంపై గంగాధరుని విహారం



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శివపార్వతులు గజవాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ ఈవో తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమవుతుందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బొమ్మసముద్రం పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పథకాల పరంగా ఆయా కుటుంబాల వ్యక్తులు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడప గడపకు వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆయా ప్రాంతాల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, పేదల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్న సీఎం వాటి పరిష్కారానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాల నగదు జమ చేస్తున్నారని, సంక్షేమ పథకాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు ప్రవీణ్, రజనీకాంత్, రవి, శిలంబరసన్, సాయి, సాయిప్రతాప్, దయానందరెడ్డి, సుధాకర్‌నాయుడు, యోవాన్, బాబు, సంపత్, కారిమేఘన్, పులేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా ఊరిలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయ్ సార్!


ఎర్రచేనులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- ఎర్రచేను, మిట్ట ఇండ్లు గ్రామస్తుల నివేదన
- అధికారులతో మాట్లాడి పరిష్కరించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: ''మా ఊర్లలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయ్ సార్..సరైన దారి లేదు..కరెంటు స్తంభాలు సరిగా లేవు.. మురుగు కాలువల్లో నీరు నిలిచి దోమల మోతతో ఇబ్బంది పడుతున్నాం.. పారిశుధ్యం సరిగా లేదు..'' అని ఎర్రచేను, మిట్ట ఇండ్లు గ్రామస్తులు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు సమస్యలు నివేదించారు. గురువారం మండలంలోని దాసరాపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎర్రచేను, మిట్టఇండ్లు గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, అధికారులు తరచూ గ్రామాలలో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో సమస్యల పరిష్కారానికి వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్, ఏఈలు, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, కార్తీక్ రెడ్డి, పద్మనాభరెడ్డి, గురునాథ్ రెడ్డి, హరినారాయణ రెడ్డి, రవీంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం


కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

గుడిపాల: కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు సీఎంసీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఫ్లొరెన్స్ అన్నారు. గుడిపాలలోని సీఎన్ఆర్ కళాశాలలో గురువారం కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేన్సర్ వ్యాధి వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం చేసేవారికి ఎక్కువగా లంగ్స్, లివర్ కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. తొలి దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే చికిత్సతో వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కళాశాల అధ్యాపకురాలు అన్నై ఎలిజబెత్ మాట్లాడుతూ, భారత దేశంలో ప్రతి వెయ్యిమంది స్త్రీలలో 105 మంది బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. అమెరికన్ కేన్సర్ అసోసియేషన్ పరిశోధనలో 20 ఏళ్లు దాటిన మహిళలు బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు వేదవతి, జ్యోత్స్న, పేష, రీనా, కస్తూరి పాల్గొన్నారు.

గొడుగుచింత లేఅవుట్ పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు ఎంపీడీఓ గౌరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొడుగుచింతలో జగనన్న లేఅవుట్‌ను ఆమె పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసే దిశగా అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. హౌసింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారుల చేత పనులు వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ సెక్రటరీ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి


మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి

చిత్తూరు రూరల్: డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి అన్నారు. చిత్తూరు–2 డిపోలో గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిశాయి. ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడారు. డ్రైవర్ల తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. డీపీటీఓ జితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీకి డ్రైవర్లే చాలా కీలకమన్నారు. డ్యూటీ సమయంలో రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. అలాగే ఆర్టీసీకి ఇంధన పొదుపు అత్యంత ముఖ్యమన్నారు. జాగ్రత్తగా బస్సులు నడిపి ప్రమాద రహిత డిపోగా పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్, డిపో అధికారులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం


విరాళమిస్తున్న హైదరాబాద్ వాసులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన నీలిమ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

కారు సహా కర్ణాటక మద్యం స్వాధీనం

- నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

చిత్తూరు అర్బన్ : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సెబ్ అర్బన్ సీఐ జోగేంద్ర తెలిపారు. ఆయన కథనం.. గురువారం నగరంలోని దుర్గానగర్ కాలనీలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో తులసీ రామ్ అనే అతను తన కారులో అక్రమంగామద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. రూ.60 వేలు విలువ చేసే 1152 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు కారును సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేఖకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న సురేఖ

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సురేఖకు డాక్టరేట్‌ను ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. 'నోవల్ కెటలిటిక్ అప్లికేషన్స్ ఆఫ్ కాపర్ ఫెరైట్ నానో పార్టికల్స్ అండ్ ఆప్టికల్ అప్లికేషన్స్ ఆఫ్ నానో కాంపోజిట్స్' అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ పాల్‌డగ్లస్, హిమబిందు ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఆమెను సావిత్రమ్మ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు అభినందించారు.

రెండు కార్లు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు



గుడిపాల: రెండు కార్లు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. చిత్తూరు–వేలూరు రహదారిలోని అనుపు గ్రామం వద్ద గురువారం రాత్రి వేలూరు నుంచి చిత్తూరుకు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో తమిళనాడులోని వేలూరు జిల్లా సత్తువాచారి ప్రాంతానికి చెందిన జయశంకర్(63), వాసు(57)కు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పాపసముద్రం గ్రామానికి చెందిన రమేష్(48)కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా సంఘాల కోసమే మైక్రోసాఫ్ట్ బ్రాంచ్


బ్రాంచ్‌ని పరిశీలిస్తున్న పీడీఎం, లీడ్‌బ్యాంకు మేనేజర్

పలమనేరు: పలమనేరు మండలంలోని గ్రూపు మహిళల సేవల కోసమే ప్రత్యేకంగా ఇండియన్ బ్యాంకు వారు మైక్రోసాఫ్ట్ బ్రాంచ్‌ని ఏర్పాటు చేశారని డీఆర్‌డీఏ పీడీఎం తులసి తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావుతో కలసి గురువారం ఆమె స్థానిక బ్రాంచ్‌ని సందర్శించారు. ఈ బ్రాంచ్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలను గ్రూపు సభ్యులు సకాలంలో చెల్లించాలని కోరారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్ష లెవల్–2లో చిత్తూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షలో నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న మోక్షిత, క్రిసి ఏంజెలీనా, ప్రేరిత ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ చక్రధర్ తెలిపారు. వారిని అభినందించారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పనితీరు పరిశీలన


టెస్టింగ్ రిపోర్టును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్

నగరి: నగరి మార్కెట్ యార్డులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులను పరీక్షించే విధానాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ల్యాబ్‌లో 181 విత్తన శాంపిల్స్‌ను, 97 ఎరువుల శాంపిల్స్‌ను పరీక్షించినట్లు ల్యాబ్ ఏవో యామిని వివరించారు. టెస్టింగ్ రిపోర్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడీఏ, ఏవోలు రైతులకు టెస్టింగ్ ల్యాబ్ విశిష్టతను వివరించి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణదారులు కూడా నగదు చెల్లించి విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో పరీక్షించుకోవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అబీబ్ బాషా, చిత్తూరు డివిజన్ ఏడీఏ మధుసూదన్, నగరి డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ల్యాబ్ అనాలసిస్ట్ తులసీ జలంధర్, సెంధామరమ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు పంచాయతీ అగ్రహారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ఇక్కడ 30 ఎకరాల్లో ఏడాది పొడవునా ఏయే పంటలు పండిస్తారు, మార్కెటింగ్ ఏవిధంగా చేస్తారు తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బెల్లంను టీటీడీ కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. జేడీఏ హబీబ్‌బాషా, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, డీపీఎం వాసు, మండల వ్యవసాయాధికారి వందన, మాజీ ఎంపీటీసీ జయరామన్ పాల్గొన్నారు.

5న పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమలలో 5వ తేదీ పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరుగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అలాగే రామకృష్ణ తీర్థ ముక్కోటిని ఘనంగా నిర్వహించనున్నారు. వీటిలో స్వామి పుష్కరిణి తీర్థం, కుమారధార తీర్థం, తుంబురు తీర్థం, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ తీర్థం, పాపవినాశన తీర్థం, పాండవ తీర్థం ప్రధానమైనవి. ఇందులో స్నానం ఆచరించిన భక్తులు ముక్తి పొందుతారని ఆర్యోక్తి.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణం

- నగర కమిషనర్ అరుణ ఆదేశం


ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : వేగవంతంగా జగనన్న లే అవుట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ అరుణ ఆదేశించారు. గురువారం ఆమె బండపల్లెలోని 1, 2 లే అవుట్లను పరిశీలించారు. వివిధ దశల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. బీఎల్ స్టేజిలో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మార్చి 15 కల్లా నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన పక్షంలో మరికొందరు మేస్త్రీలు, కూలీలను నియమించి పనులు వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

గంగవరం: మండలంలోని వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో నాలుగు మండలాల సంఘమిత్రలకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల మహిళా సంఘమిత్రలు శిక్షణకు హాజరయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు తులసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరు రోజులు పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రధానంగా పొదుపు సంఘాల నిర్వహణ, రుణాలు ఏ విధంగా ఖర్చు పెట్టాలి, రుణాలను జాగ్రత్తగా వాడుకునే విధానం, వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎలా ఎదగాలి, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఏరియా కోఆర్డినేటర్ హరినాథ్, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాణ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



పలమనేరు: ద్వాదశి సందర్భంగా పట్టణ సమీపంలోని విష్ణుపురి నిర్వాణ నారాయణ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఐఆర్ఎం కళాశాలలో ఫ్రాన్స్ దేశస్తులు


కళాశాలలో ఫ్రాన్స్ దేశస్తులు

కుప్పం: కుప్పం పట్టణంలోని ఐఆర్ఎం విద్యాసంస్థలను గురువారం ఫ్రాన్స్ దేశస్తులు సందర్శించారు. ఫ్రాన్స్ దేశం విద్యావేత్త ఫ్రాక్ లియో ఆధ్వర్యంలో బోధనా పద్ధతులపై కళాశాల చైర్మన్ దయానిధితో సమీక్షించారు. విదేశాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను వారు నివృత్తి చేశారు.

రూ.40 వేల ఉపాధి మొక్కలు మాయం!



సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ గంగాభవానీ

- మళ్లీ నాటాలని అధికారుల ఆదేశం
- సమావేశానికి ఎస్సార్పీ గైర్హాజర్

పలమనేరు: మండలంలో గతేడాది ఉపాధి హామీ కింద రూ.32లక్షల పనులు జరగ్గా, విచారణ చేసిన సామాజిక తనిఖీ బృందం రూ.41 వేలు అక్రమాలు జరిగినట్లు తేల్చింది. రూ.40 వేల ఉపాధి మొక్కలు మాయమైనట్లు గుర్తించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో 1–4–2021 నుంచి 31–3–2022 దాకా జరిగిన 900 పనులకు సంబంధించి ఖర్చుచేసిన మొత్తం రూ.32 లక్షలపై ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ పద్మజ హాజరయ్యారు. మండలంలో జరిగిన పనులను వారం రోజులు సోషల్ ఆడిట్ సభ్యులు ఆయా గ్రామాల్లో విచారించి జరిగిన అక్రమాల నివేదికను అధికారులు వెల్లడించారు. కేవలం నాటిన మొక్కలు మాత్రమే అక్కడక్కడా కనిపించడం లేదని ఆ నివేదికలో తెలిపారు. ఓపెన్‌ఫోరంలో ఈ అక్రమాలపై స్పందించిన అధికారుల బృందం మళ్లీ మొక్కలు నాటించాలని ఆదేశించి సమావేశాన్ని ముగించారు. విచారణ బృందానికి నాయకత్వం వహించి న ఎస్ఆర్పీ రామారావు సమావేశానికి హాజరు కాకపోవడం విశేషం. ఈ సమావేశంలో ఎంపీపీ గీత, ఎంపీడీవో విద్యాసాగర్, విశ్వనాథ రెడ్డి, ఏపీవోలు పుష్పలత, రవి, జేఈ సుబ్రమణ్యం మండలంలోని టీఏ లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.